క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్దకల్: మండలంలోని బూడిదపాడు, బిజ్వారం విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, ఇతర పనుల కారణంగా గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అయిజ ఏడీఈ గోవిందు, మల్దకల్ ఏఈ దుర్గప్రసాద్‌లు తెలిపారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని వారు కోరారు.

డీవీ కృష్ణన్నకు ఘన నివాళి



గద్వాల అర్బన్: భూస్వాముల దోపిడీని ఎదుర్కొని పేద ప్రజల పక్షాన పోరాడిన కామ్రేడ్ డీవీ కృష్ణన్న రెండో వర్ధంతి సందర్భంగా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా కార్యాలయంలో డీవీ కృష్ణన్న చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జమ్మిచేడు కార్తీక్ మాట్లాడుతూ పోరాట యోధుడు డీవీ కృష్ణన్న అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమరాజు, మనోజ్‌కుమార్, సుధాకర్ ఉన్నారు.

ఎస్పీని కలిసిన మండల నాయకులు

మానవపాడు: మండలంలోని జల్లాపురం గ్రామానికి చెందిన జోగుళాంబ టెంపుల్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు బుధవారం ఎస్పీ శ్రీనివాస రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బందులు కలుగజేసినా చర్యలు తీసుకుంటామని మండల నాయకులకు సూచించారు. కార్యక్రమంలో మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలి'

మానవపాడు: మండలంలోని పెద్దఆముదాలపాడు, నారాయణపురం గ్రామాల్లో బుధవారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్‌ఆర్ ఈజీఎస్ కింద 7 రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆన్‌లైన్‌లో జాబ్‌కార్డుల నమోదు వివరాలను పరిశీలించారు. నారాయణపురం గ్రామంలో రెండు రికార్డులు నమోదు చేయలేదని, 3రోజులలో పూర్తి చేయాలని ఆదేశించారు. నర్సరీలను పరిశీలించి హరితహారానికి మొక్కలను సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ చెత్త డీసీఎం పట్టివేత

ఉండవెల్లి: కర్నూల్ నుంచి సిద్దిపేటకు చేపల కంపెనీకి చికెన్ చెత్తను తరలిస్తున్నడీసీఎంను పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ ఈరన్న కథనం మేరకు.. పుల్లూర్ టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో చికెన్ చెత్తతో డీసీఎం వచ్చింది. వెంటనే పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బుధవారం డ్రైవర్ సురేష్, వాహన యజమాని కుమారస్వామిపై కేసు నమోదు చేశారు. గ్రామ చివర జేసీబీ సహాయంతో గుంత తీసి అందులో చికెన్ చెత్తను పూడ్చినట్లు పోలీసులు తెలిపారు.

అయ్యప్ప స్వామికి అభిషేకం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి విగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బియ్యం ఇవ్వని మిల్లులు సీజ్‌చేస్తాం

ఆత్మకూర్: రైస్ మిల్లర్లు వారంరోజుల్లోగా బియ్యం సీఎంఆర్‌కు అప్పజెప్పకుంటే రైస్‌మిల్లులను సీజ్ చేస్తామని తహసీల్దార్ రాజు స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరు ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైస్‌మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరించిన ధాన్యం మిల్లర్లకు అప్పగించినట్లు వివరించారు. నిర్దేశించిన సమయంలోగా బియ్యం అప్పజెప్పకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రహదారి వంతెనలపై రక్షణేది?

- రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా..
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



శేషంపల్లి స్టేజీ సమీపంలో కల్వర్టుపై రక్షణ గోడలేక పొంచి ఉన్న ప్రమాదం



తాటికుంట స్టేజీ సమీపంలో కల్వర్టుపై రక్షణ గోడ లేక పొంచి ఉన్న ప్రమాదం

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు రహదారులు సరిగా లేకపోవడం, మరోవైపు వంతెనలు శిథిలావస్థకు చేరుకోవడంతోపాటు రక్షణ గోడలు లేక నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే రహదారులలో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ విషయమై వాహనదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. గద్వాల – అయిజ ప్రధాన రహదారిలోని శేషంపల్లి, తాటికుంట, నాగర్‌దొడ్డి స్టేజీల వద్ద ఉన్న రహదారిలోని కల్వర్టులపై రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం ఈ రహదారిపై వేలాదిగా వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. రక్షణ గోడ లేని కల్వర్టుల వద్ద పెద్ద 10ఫీట్లకు పైగా గుంతలు ఉండటంతో వాహన దారులు ప్రమాదవ శాత్తు పడితే ప్రాణాలకు గాల్లో కలిసే అవకాశం ఉంది. శేషంపల్లి నుంచి తాటికుంట, మల్దకల్ నుంచి కుర్తిరావుల్ చెర్వు వెళ్లే రహదారిలోని కల్వర్టుపై ఉన్న వంతెన కూలి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మలుపు వద్ద కల్వర్టుకు రక్షణ గోడ లేక వాహన దారులు ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లి కాల్వలో పడే ప్రమాదం ఉంది. ఈ విషయమై పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టులపై రక్షణగోడలు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఆర్‌అండ్‌బీ రహదారుల కల్వర్టులపై రక్షణ గోడలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఏఏ కల్వర్టుల వద్ద రక్షణ గోడలు లేవో వాటిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించడం జరిగిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టెండర్లు పిలిచి పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

– మహేశ్‌కుమార్, ఏఈ ఆర్‌అండ్‌బీ

రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి



మల్దకల్ నుంచి అయిజకు వెళ్లే రహదారిలోని తాటికుంట సమీపంలో ఉన్న కల్వర్టుకు రక్షణ గోడ లేకపోవడంతో ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా అందులోపడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రోడ్ల నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్లు కల్వర్టులపై రక్షణ గోడ నిర్మించకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతుంది.

– రామాంజినేయులు, మల్దకల్

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ప్రధాన రహదారులపై ఉన్న కల్వర్టుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరగక ముందే అధికారులు తగు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహణదారుల ప్రాణాలు గాల్లో కలిసే అవకాశం ఉంది.

– రాముడు, నాగర్‌దొడ్డి

ముగిసిన పూర్వ ప్రాథమిక విద్య శిక్షణ



మల్దకల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ కమలాదేవి



గద్వాలలో శిక్షణ పూర్తయిన అంగన్‌వాడీ టీచర్లతో సీడీపీఓ, సూపర్‌వైజర్లు



మానవపాడులో పూర్వ విద్యపై శిక్షణ పూర్తి చేసుకున్న మొదటి బ్యాచ్ అంగన్‌వాడీ టీచర్లు

మల్దకల్: చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య ద్వారానే పిల్లలకు అంకెల పరిచయం అక్షర పరిచయాలు సులభతరంగా నేర్చుకుంటారని సీడీపీఓ కమలాదేవి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. పూర్వ ప్రాథమిక విద్యపై నిర్వహించిన శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల జీవితాల్లో ఆరేళ్లు చాలా కీలకమైనవని, ఈ దశలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే ప్రేరణ, అనుభవాలు వారి భవిష్యత్‌కు సంపూర్ణ అభివృద్ధికి, వికాసానికి పునాది వేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. గర్భిణులు పోషకాలు ఎక్కువగా ఉండే పాలు, గుడ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగరాణి, వెంకటేశ్వరి, యమిని, సంధ్య, వాసంతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా విద్యను అందించాలి

గద్వాల అర్బన్: ప్రైవేటు స్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విద్య అందించాలని సీడీపీఓ హేమలత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పిల్లల మేథో వికాసం, సమగ్రాభివృద్ధి అంశం గద్వాల అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొదటి బ్యాచ్‌కు శిక్షణ పూర్తయినట్లు ఆమె తెలిపారు. చిన్నారులకు ప్రాథమిక విద్యను ఏ విధంగా అందించాలనే తదితర అంశాలపై వివరించారు. ప్రాథమిక విద్య కరదీపిక, ప్రియదర్శి బుక్స్, మెటీరియల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణమ్మ, పద్మమ్మ, బాలనర్సమ్మ, సునీతమ్మ, పోషణ్ బృందం సభ్యుడు నరేష్ తదితరులు ఉన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలో ప్రియదర్శిని పూర్వ విద్యపై మొదటి అంగన్‌వాడీ శిక్షణ తరగతులు పూర్తి చేసినట్లు సీడీపీఓ సుజాత తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో మూడో రోజు పూర్వవిద్యపై శిక్షణ కార్యక్రమం పూర్తి చేశామన్నారు. మూడు రోజులుగా పూర్వవిద్యపై 35మందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి



గార్లపాడులో క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సరిత

ధరూరు: మండలంలోని గార్లపాడు గ్రామంలో సవారమ్మ జాతరను పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సరిత ప్రారంభించారు. బుధవారం సాయంత్రం గ్రామ దేవతల నెల పూజ సందర్భంగా గ్రామంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని జెడ్పీ చైర్ పర్సన్ సరిత అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ యువత రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌బాబు, సింగిల్ విండో మాజీ చైర్మన్ సీసల్ వెంకట్‌రెడ్డి, డీఆర్ శ్రీధర్, శ్రీనివాసులు, కుర్వ రవి, మౌలాలి, సురేష్, మినలన్న, గిరి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి దారేది?



మానవపాడు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–4కు వెళ్లడానికి కొన్ని రోజులుగా చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి పక్కనే అంగన్‌వాడీ కేంద్రానికి దారి ఉండేది. కానీ ఇప్పుడు అంగన్‌వాడీ కేంద్రం–4 దారికి అడ్డుగోడ కట్టారు. అంగన్‌వాడీ కేంద్రంలో 15 మంది చిన్నారులకు టైలెట్స్, మరుగుదొడ్లకు గతంలో ఖాళీ స్థలం వాడుకునే వారు. ఇప్పుడు వెళ్లడానికి దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెనుక వైపు నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గోడ నిర్మాణం తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మల్దకల్‌లో పాఠశాలలను బంద్ చేస్తున్న నాయకులు

మల్దకల్: ప్రైవేటు పాఠశాలలో అధిక ఫీజుల వసూళ్లను ప్రభుత్వం వెంటనే నియంత్రించి ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు శివ ప్రసాద్, తిరుమలేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మల్దకల్‌లో పాఠశాలలను బంద్ చేశారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు అధిక ఫీజుల వసూళ్లతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగులో ఉన్న స్కాలర్‌షిప్పులు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో తిరుమలేష్, శాంతిరాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించేలా చూడాలి



అలంపూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ మాదిగ

అలంపూర్: ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ మాదిగ అన్నారు. అలంపూర్ పట్టణంలోని టూరిజం హోటల్‌లో బుధవారం టీఎస్ ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం అడ్మిషన్లు బలహీనవర్గాల పిల్లలకు ఇచ్చే విధంగా ఆదేశాలు జారీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సిలబస్ పుస్తకాల ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో బోధన చేయడం లేదన్నారు. ప్రభుత్వ సిలబస్‌తోనే బోధన చేయాలని గతంలో జీఓ నెంబర్ 1 ద్వారా ఉత్తర్వులు జారీ చేసినా నిబంధనలు పాటించడం లేదన్నారు. ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రైవేటు పబ్లిషర్స్‌తో ఒప్పందం చేసుకొని విద్యార్థులకు అధిక ధరలకు పుస్తకాలు అంటగడుతున్నారన్నారు. పుస్తకాలు, అడ్మిషన్ ఫీజులు, యూనిఫామ్, నోట్ బుక్స్ ఇతర స్టేషనరీ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు పరోక్షంగా ప్రైవేటు యాజమాన్యానికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఫీజుల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 91ని అమలు చేసే విధంగా చూడాలన్నారు. నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు. కలెక్టర్ సంబంధిత విద్యాశాఖ అధికారులు, ప్రైవేటు యాజమాన్యంతో సమావేశం నిర్వహించి అధిక ఫీజులను కట్టడి చేయాలన్నారు. సమావేశంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రేమదాసు, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ఉండవెల్లిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



రాజోళిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు



అయిజలో ర్యాలీ చేస్తున్న తహసీల్దార్ జ్యోతి, పోలీసులు, విద్యార్థులు



మానవపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

అయిజ: డ్రగ్స్ వల్ల యువత శారీరకంగా, మానసికంగా అనారోగ్యాల పాలవుతున్నారని డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని తహసీల్దార్ జ్యోతి అన్నారు. మండల కేంద్రంలో ఎస్ఐ విజయ భాస్కర్ విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి మాట్లాడారు. మత్తు మందుకు బానిసైన యువత తమ జీవితాన్ని నాశనం చేసుకుంటోందని, సమాజానికి చీడపీడల్లా తయారవుతున్నారని వాపోయారు. డ్రగ్స్‌ను భారత దేశంలో లేకుండా తరిమి కొడుదామన్నారు. కార్యక్రమంలో పోలీస్ బృందం, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం అంధకారం

రాజోళి: మాదకద్రవ్యాలు వాడితే జీవితం అంధకారంలోకి వెళ్తుందని ఎస్ఐ జగదీశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందమయ జీవితంలో మత్తు పదార్థాల వల్ల కుటుంబాలే నాశనమవుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, మత్తు పదర్థాల నుంచి కుటుంబాలను కాపాడుకోవాలని విద్యార్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. మత్తుకు బానిస కాకుండా మన కుటుంబాలను రక్షించాలని, వాటిని నిర్మూలించేందుకు నడుం బిగించాలని తహసీల్దార్ సలీముద్దీన్, ఎంపీడీఓ జబ్బార్ ప్రతిజ్ఞ చేయించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిషేధిత దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఈరన్న, ఉపాధ్యాయులు మద్దిలేటి, శ్రీలక్ష్మి, పోలీస్ సిబ్బంది, నాగేష్, ఖాదర్ బాషా, రవి, వీణ, సంతోషమ్మ, రమేష్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో సమాజానికి చేటు

మానవపాడు: సమాజానికి చేటుగా పరిణమించిన మాదకద్రవ్యాలకు అందరూ దూరంగా ఉండాలని ఎస్ఐ చంద్రకాంత్, ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని ప్రభుత్వ ఆస్పత్రిలో డిఎడిక్షన్ సెంటర్‌కు తీసుకెళ్లాలన్నారు. మాదకద్రవ్యాలు విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాలపై యువత మేలుకొని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్, లక్ష్మన్న, శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధరూరు: యువత మాదకద్రవ్యాల బారినపడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని మండల ఎస్ఐ విజయ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ చౌరస్తాలో ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట్రావు, ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ర్యాలీ ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రాజు వివిధ పాఠశాలల విద్యార్థులతో కాలనీల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ కూడలిలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

గట్టు: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ మల్లేష్ కోరారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా గట్టు పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎర్రవల్లిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



గట్టులో ర్యాలీ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు

సమస్యలను పరిష్కరించండి



ముళ్ల పొదలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్నను కోరారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో రంగుపేట, సంత బజార్ కాలనీల్లో మున్సిపల్ చైర్మన్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముళ్ల పొదలు రోడ్డుపై వాలి రాకపోలకు ఇబ్బందిగా ఉందని ప్రజలు తెలిపారు. మద్దిలేటి స్వామి ఆలయం సమీపంలో మిషన్ భగీరథ పైప్ లైన్‌లు లీకవుతున్నాయని, నీళ్ల రోడ్డుపై నిలిచిపోయి మురుగు ఏర్పడిందని తెలిపారు. డ్రైయినేజీల్లో చెత్త పేరుకుపోయిందని, మురుగునీరు రోడ్లపై పారుతుందని, దాని వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ అన్నారు. శిథిలమైన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. దానికి మరమ్మతులు చేసి మున్సిపల్ కార్యాలయ నిర్వాహనకు ఉపయోగించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మన్న, జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్, వార్డు ఆఫీసర్లు, లైన్‌మెన్లు, ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.